క్లుప్తంగా

ఎస్పీని కలిసిన రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు: జిల్లా ఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్.వి.మాధవ రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి శనివారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి

తలుపుల: మండలంలోని గంజివారిపల్లి గ్రామానికి చెందిన మాజీ వీఆర్‌ఓ కే.భాస్కర్ రెడ్డి భార్య, కదిరి వీఆర్‌ఓ నరసింహారెడ్డి తల్లి పార్వతమ్మ(80) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులు రెడ్డి వెళ్లి పార్వతమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

అభయాంజనేయస్వామికి పూజలు



ధర్మవరం అర్బన్: పట్టణంలోని లింగిశెట్టిపాలెంలో కొలువైన అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు జనార్ధన్ ఆధ్వర్యంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకులు, తులసి ఆకులు, వివిధ రకాల పూలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

పేద రైతులందరికీ ఉచిత బోర్లు



కనగానపల్లిలో ఉచిత బోరు వేస్తున్న దృశ్యం

కనగానపల్లి: అర్హత ఉన్న ప్రతి పేద రైతుకూ తోపుదుర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా బోరు వేయిస్తున్నట్లు కనగానపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పాపన్న, అంకె రామకృష్ణ, గోపాల్ తెలిపారు. కనగానపల్లిలో చేపట్టిన ఉచిత బోర్ల తవ్వకం కార్యక్రమాన్ని పార్టీ నాయకులతో కలసి శనివారం వారు పరిశీలించారు. అన్నదాతలకు అండగా నిలవాలన్న ఉద్దేశ్యంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులను వెచ్చించి ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. అర్హత కలిగిన రైతుల ఎంపిక పారదర్శకంగా ఉండేలా ప్రతి గ్రామానికి ఓ కమిటీని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో కనగానపల్లి గ్రామంలోనే 32 మంది రైతులకు బోర్లు వేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చింతమేకల రవి, లక్ష్మీనారాయణ, రమేష్, సాకే నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

టీఎన్ పాళ్యంలో వైద్య సేవలు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాజేంద్ర నాయక్

ముదిగుబ్బ: మండల పరిధిలోని టీఎస్ పాళ్యంలో శనివారం డాక్టర్ నాగేంద్ర నాయక్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓ దివ్యశ్రీ, ఎంపీహెచ్ఏ హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉడికించినా తొలగని అవశేషాలు

కూరగాయలపై విష రసాయనాల ప్రభావం

- రోగాలను కొని తెచ్చుకుంటున్నాం
- ప్రమాదకర జబ్బులు వస్తాయంటున్న వైద్యులు



ఎరువుల దుకాణంలో విక్రయించే రసాయన మందులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

ధర్మవరం: తినే తిండి, తాగే నీరు, పీల్చే గాలే కాదు నిత్యం వండుకునే కూరగాయలు కూడా విషం చిమ్ముతుండటంతో జబ్బులు వెంటాడుతున్నాయి. పుష్కలమైన పోషక పదార్థాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాల్సిన ఆకుకూరలు, కూరగాయలు అనారోగ్యానికి కారణమవుతున్నాయి. కూరగాయల పంటలపై ప్రాణాంతకమైన క్రిమి సంహారక మందులను పిచికారి చేస్తుండటంతో ఈ పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. కూరగాయల పంటలకు సాధారణంగా వివిధ తెగుళ్ల బెడద ఉంటుంది. వాటి నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులు పురుగు మందులను పిచికారి చేస్తుంటారు. తేలికపాటి క్రిమి సంహారక మందుల్ని తరచూ వాడాల్సి వస్తుందన్న ఉద్దేశంతో కొందరు రైతులు అధిక ప్రభావం ఉండే సింథటిక్ పైరిత్రాయిడ్స్‌ను వాడుతున్నారు. దీంతో కూరగాయల్లో ఔషధ గుణాలు, పోషక విలువలు నశిస్తున్నాయి. అలాంటి కూరగాయలు ఆరోగ్యానికి ప్రమాదకరంగా తయారవుతున్నాయి. ఉదయం వండిన కూరలు సాయంత్రానికే రుచి మారిపోవటం, చెడిపోవటం, రసాయనాల వాసనలు వెదజల్లుతుండటం ఒక భాగమైతే మరో వైపు వ్యాధులు పొంచి ఉన్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో సాధారణంగా టమోటా, వంకాయ, దోస, బెండ, బీరకాయ, తదితర సాగుతోపాటు పాలకూర, మెంతికూర, గోంగూర తదితర పంటల పట్ల ఆసక్తి కనబరుస్తున్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల నివారణకు వాడే మందులను కూరగాయల పంటలపై వినియోగిస్తున్నారు. ఇలా జిల్లాలో ఏడాదికి కూరగాయల పంటలపై రూ.50 లక్షల నుంచి రూ.70 లక్షల పురుగుల మందులను పిచికారీ చేస్తున్నట్లు ఓ అంచనా.

వేడినీటితో శుద్ధి చేసినా మందుల ప్రభావం ఉంటుంది



కూరగాయల్ని వేడి నీటిలో శుద్ధి చేసి ఉడికించాలి. అయినా రసాయనాల ప్రభావం ఉంటుంది. కేన్సర్ సోకే ప్రమాదమున్నందున పిచికారి మందుల విషయంలో వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. కూరగాయలను ఉడికించినా వాటి అవశేషాలు మనిషి ఆరోగ్యానికి హానికరంగా మారుతాయి. ప్రధానంగా జీర్ణకోశ వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, కేన్సర్ తదితర జబ్బులు వచ్చే అవకాశాలున్నాయి.

– డాక్టర్ ఎం.నాగప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు, ధర్మవరం

పత్తికి ఉపయోగించే మందులు వాడకూడదు



పురుగు వెంటనే చనిపోవాలని చాలా మంది రైతులు పత్తికి ఉపయోగించే మందులను కూరగాయల పంటలకు వినియోగిస్తున్నారు. ఇది సరి కాదు. కూరగాయల సాగులో తేలికపాటి పిచికారి మందులనే వాడాలి. ప్రాణాంతకమైన క్రిమి సంహారక మందుల్ని వాడకూడదని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వేప కషాయం, క్లోరోపైరిపాస్ తదితర మందులు వాడకం వల్ల వాటి ప్రభావం కూరగాయలపై పరిమితంగా ఉంటుంది. సేంద్రీయ ఎరువులు ఎంతో ఆరోగ్యకరం. వాటిపైనే రైతులు దృష్టి పెట్టాలి.

– చిన్నవీరాస్వామి, వ్యవసాయాధికారి, ధర్మవరం

గంగాభవానీదేవి ఊరేగింపు



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

గాండ్లపెంట: మండల కేంద్రంలో కొలువైన గంగాభవాని దేవి 15వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరునాల నిర్వహణకు రూ.30వేలు అందించిన ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ తాతం జగన్మోహన్, సొసైటీ అధ్యక్షుడు ఎస్పీ హైదర్‌వలీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. ఆదివారం తెల్లవారుజామున జ్యోతులు, బోనాలు సమర్పించనున్నారు.

భక్తులతో ఖాద్రీ ఆలయం కిటకిట



కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కదిరి పరిసరాల ప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీఖాద్రీశుని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పేదల సొంతింటి కల జగనన్నతో సాకారం



లబ్ధిదారులకు ఇంటి పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- జగనన్న లేఔట్‌లో గృహ నిర్మాణాలకు భూమిపూజ

గాండ్లపెంట: పేదలు ఇల్లు నిర్మించుకుని సంతోషంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయమని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారికి సమీపంలోని జగనన్న లేఔట్‌లో గృహ నిర్మాణాలకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు. ఎంతమంది పట్టాలు పొందారని ఏఈ చంద్రారెడ్డిని అడిగారు. 136 మందికి పట్టాలు అందజేసినట్లు ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం గృహ లబ్ధిదారులకు రూ.1.80 లక్షల మంజూరు చేయడంతోపాటు కాలనీల్లో మంచినీరు, విద్యుత్, రోడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టాలు పొందినవారంతా ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఉంటే ఇళ్లు మంజూరు చేయించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, సర్పంచ్ రహంతుల్లా, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ పోరెడ్డిచంద్రశేఖరరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, కదిరి రూరల్ కన్వీనర్ ప్రకాష్, ఉత్తన్న, మైనార్టీ నాయకులు ఇక్బాల్, సికిందర్, ఫారుక్, మైను, హుసేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి



లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.శివపార్వతి



పుట్టపర్తిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: రాజీ మార్గంలో కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి అన్నారు. శనివారం కదిరి కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 252 కేసులు పరిష్కరించినట్లు జడ్జి తెలిపారు. మూడు సివిల్ కేసులు, ఒక భరణం, చెక్ బౌన్స్‌కేసు, క్రిమినల్ కేసులు 60కేసులతో పాటు మొత్తం 252 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు.సీనియర్ న్యాయవాదులు ప్రసాద్‌రెడ్డి, సత్యనారాయణ గుప్తా, కె.నరసింహులు పాల్గొన్నారు. బెంచ్ సభ్యులుగా లింగాల లోకేశ్వర్‌రెడ్డి, కె.వై.సిరాజుద్దీన్ వ్యవహరించారు.

లోక్‌అదాలత్‌తో 319 కేసుల పరిష్కారం

ధర్మవరం అర్బన్: ధర్మవరంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 319 కేసులు పరిష్కరించినట్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.శివపార్వతి తెలిపారు. రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కొట్లాట కేసులు–76, అక్రమ ఇసుక రవాణా –6, చెక్‌బౌన్స్ కేసులు –3, భూమి తగాదా కేసులు –5, ప్రామిసరీనోటు కేసులు–1, భార్య,భర్తల కేసు–1, బ్యాంకు రుణం కేసులు–16, గేమింగ్ కేసులు–211 మొత్తం 319 కేసులు పరిష్కారమయ్యాయి. బ్యాంకు రుణం కేసుల్లో రూ.7,69,500లు, గేమింగ్ కేసుల్లో రూ.1,21,487 వసూలు చేశారు.

పుట్టపర్తి అర్బన్: రాజీ కాదగ్గ కేసులకు లోక్ అదాలత్ చక్కటి పరిష్కారం చూపుతుందని జూనియర్ సివిల్ జడ్జి రాకేష్ పేర్కొన్నారు. శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో పలు సివిల్, క్రిమినల్ పరిష్కరించారు. జడ్జి మాట్లాడుతూ మొత్తం 152 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి గంగిరెడ్డి, సీఐలు బాలసుబ్రమణ్యంరెడ్డి, జయానాయక్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

కొత్తచెరువు: పర్యావరణ హితం కోసం ప్లాస్టిక్‌కు పాతర వేయాలని అటవీ శాఖ ఎఫ్ఎస్ఓ చంద్రనాయక్ సూచించారు. నారేపల్లిలో అటవీ శాఖ అధికారులు పర్యావరణం కొరకు జీవనశైలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రానాయక్ మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం ప్లాస్టిక్‌ను నిషేధించాలని, మొక్కలు పెంచాలన్నారు. పచ్చని చెట్లను సంరక్షించాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ ప్రకాష్, మాజీ డీలర్ రమణారెడ్డి, ఫారెస్ట్ అధికారులు జయమ్మ, గంగాద్రి, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

సంకరజాతి లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన లేగదూడలు

ఓడీ చెరువు: మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామంలో శనివారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు సుధాకర్, పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్.. మేలైన సంకరజాతి లేగదూడలకు బహుమతులు అందించారు. పశువైద్యశాఖ అసిస్టెంట్లు పవన్‌కుమార్, కుమార్‌నాయక్, జ్యోత్స్న పాల్గొన్నారు.

15న మండల సమావేశం

తనకల్లు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 15న ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పూల నరసింహులు శనివారం తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ధర్మవరం: కర్ణాటక అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో శనివారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు పీఆర్‌టీ సర్కిల్‌లో బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. పార్టీ ఇన్‌చార్జ్ రంగన అశ్వర్థనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: బస్టాండ్ సర్కిల్‌లో కాంగెస్ పార్టీ మండల కన్వీనర్ అంజనప్ప ఆధ్వర్యంలో నాయకులు బాణ సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు.

కదిరి టౌన్: పట్టణంలోని ఇందిరాగాంధీ, జీవిమాను సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు శ్రీహరి ప్రసాద్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు.

ఓడీ చెరువు: ఓడీ చెరువు, కొండకమర్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. మండల కన్వీనర్ రామాంజినేయులు, కొండకమర్ల జౌలి బాబా పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓటర్లు తగిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను ఆదరించారని ఏఐసీసీ సభ్యుడు కోటా సత్యనారాయణ అన్నారు. కార్మికులు విద్యావంతులు, మేధావులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలు విసిగిపోయి బీజేపీకి గుణపాఠం చెప్పారన్నారు.

కనగానపల్లి: కనగానపల్లిలో కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బిల్లే ముత్యాలు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బాణాసంచా పేల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. ఆంజనేయులు, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ అంతరాయం

పుట్టపర్తి టౌన్: మరమ్మత్తుల దృష్ట్యా ఆదివారం పట్టణంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ శరవానన్ శనివారం తెలిపారు. ప్రశాంతి ఫీడర్ -2 సమీపంలో ఉన్న ఎనుములపల్లి, గణేష్ కూడలి, గోపురం ఒకటి, రెండవ క్రాస్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గోదాముల నిర్మాణానికి స్థల పరిశీలన

రామగిరి: మండలంలోని పేరూరు, దుబ్బార్లపల్లి, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, గరిమేకలపల్లి, నసనకోట, మాదాపురం, కుంటిమద్ది, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీ కేంద్రాల్లో ప్రభుత్వ వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణానికి అనువైన స్థల పరిశీలనకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు తహసీల్దార్ నారాయణస్వామి తెలిపారు. శనివారం ఉదయం సంబంధిత అధికారులతో కలసి రామగిరి మినహా అన్ని పంచాయతీల్లో మిగిలిన ప్రాంతాల్లో స్థల పరిశీలన చేసినట్లు వివరించారు.

నేడు హనుమాన్ జయంతి

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని పాతూరు ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి రంగస్వామి తెలిపారు. వేకువజామున 4.30 గంటలకు సుప్రభాత సేవ, ఉదయం 5 గంటలకు పంచామృత సుగంధ ద్రవ్య సింధూర గంధ పుష్ప అభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రేపు వేలంపాట

ఎన్పీ కుంట: మండల పరిధిలోని ఎన్.రెడ్డివారిపల్లి గ్రామం కొత్తకుంట వద్ద ఉన్న నల్లతుమ్మ చెట్లు కొట్టివేయడానికి సోమవారం వేలంపాట నిర్వహించనున్నట్లు కార్యదర్శులు ముబారక్, రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

15న వాహనాల వేలం

పెనుకొండ: పలు ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన బైక్‌లు, కారు, ఆటోను ఈ నెల 15 ఉదయం 10 గంటలకు స్థానిక సెబ్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి శనివారం తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లచెరువు: పంతుల చెరువు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ అంజనప్ప(45) గత వారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. 1999–2000 సంవత్సరంలో ఆయనతో కలిసి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు శనివారం గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులకు రూ.31,500 ఆర్థిక సాయం అందజేశారు.

నేటినుంచి యెలవగంప మహోత్సవం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో 17వ వార్డు బీడుపల్లి గ్రామం మేకల చెరువు వద్ద వెలసిన అక్కదేవతల అమ్మవార్లకు ఆదివారం సాయంత్రం యెలవ గంప మహోత్సవం ప్రారంభం అవుతుందని పూజారి చెన్నప్ప తెలిపారు. 15వ తేదీ సోమవారం ఒడి నింపే కార్యక్రమం, అనంతరం రాజనాలు దంచే కార్యక్రమం నిర్వహించి అన్నదానం నిర్వహించనున్నారు.

ఉపాధ్యక్షుడిగా గంగిశెట్టి

నల్లమాడ: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తనను రాష్ట్ర నాయకులు నియమించినట్లు మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన ఆసాది గంగిశెట్టి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

లక్ష్మీచెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు

తాడిమర్రి: మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, జలాభిషేకం నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలు తొడిగి పూలమాలలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు ప్రమాదంలలో ఒకరి మృతి

కూడేరు: వివాహ కార్యక్రమానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా చీకట్లో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు(60) అనే వ్యక్తి ఘటనా స్థలిలోనే మృతి చెందాడు. ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలు ఇలా.. ధర్మవరానికి చెందిన శ్రీనివాసులు, ఖాజా, హుసేన్ కూడేరు మండలంలోని ఇప్పేరులో వివాహ కార్యక్రమాన్ని చూసుకుని శనివారం రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి బయలుదేరారు. మండలంలోని కమ్మూరు సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లి పోయింది. దీంతో శ్రీనివాసులు తలకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాజా, హుసేన్ తీవ్రంగా గాయపడ్డారు. అటుగా వస్తున్న వాహనాదారులు గమనించి క్షతగాత్రులను 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేపట్టారు.